## క్లుప్తంగా

### వైభవంగా జమదేవమ్మ పేరంటాలు ఉత్సవం



అన్నసంతర్పణ చేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధి చిన్నారావు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో జమదేవమ్మ పేరంటాలు ఉత్సవం గురువారం ఉత్సవ కమిటీ ప్రతినిధి చిన్నారావు పర్యవేక్షణలో వైభవంగా జరిగింది. ఈ మేరకు కమిటీ ప్రతినిధి చిన్నారావు మాట్లాడుతూ గ్రామపెద్దల సహకారంతో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఏటా ఉత్సవాలు సాధారణంగా జరిగేవన్నారు. ఈ ఏడాది పంటలు ఆశాజనకంగా పండి ఇళ్లకు చేర్చుకోవడం, వాతావరణం అనుకూలించడంతో గ్రామస్తుల సహకారంతో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ నేపథ్యంలో జమదేవమ్మ ఉత్సవం సందర్భంగా వేలాదిమంది భక్తులకు చిన్నారావు చేతుల మీదుగా అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, స్థానిక సర్పంచ్ సీహెచ్ కృష్ణ, జెడ్పీటీసీ ఎం బాబ్జీ, చిన్నారావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

### శ్రీశ్రీ మహా కవి



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సంజీవనాయుడు

బలిజిపేట: తెలుగు మహాకవి శ్రీశ్రీ అని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు కొనియాడారు. మండలంలోని పెదపెంకి గ్రామంలో నేతాజీ గ్రంథాలయం వద్ద శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీలాంటి గొప్ప కవులను స్మరించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో పి.పరుశురామ్, మహేష్, జి.శ్రావణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



లబ్ధిదారుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: మండలంలోని వంతరాం గ్రామానికి చెందిన బి.అప్పలనాయుడు కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే జోగారావు గురువారం అందజేశారు. అప్పలనాయుడు కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయం ఎమ్మెల్యే జోగారావుకు తెలియపరచడంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోమని సూచించారు. బాధిత కుటుంబసభ్యులు దరఖాస్తు చేసుకోవడంతో వారికి ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి నిధులు మంజూరు కాగా దానికి సంబంధించిన చెక్కును బాధితుడి భార్య సుమలతకు ఎమ్మెల్యే జోగారావు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, సత్యంనాయుడు, వంతరాం కన్వీనర్ ఆవు శ్రీనివాసరావు, బాధిత కుటుంబసభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రీ సర్వే వేగవంతం చేయండి

బలిజిపేట: మండలంలోని అరసాడ, తుమరాడ గ్రామాల్లో నిర్వహిస్తున్న రీ సర్వేను జేసీ గోవిందరావు గురువారం ఆకస్మికంగా పర్యవేక్షించి వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సర్వేనిర్వహణపై అధికారులు మాట్లాడుతూ అరసాడలో 2,721.02ఎకరాలకు గాను 1,014.94ఎకరాలలో సర్వే పూర్తయిందని, తుమరాడలో 1,354.82ఎకరాల విస్తీర్ణం ఉండగా ఇప్పటికి 363.12ఎకరాలలో సర్వే పూర్తయిందని తెలిపారు. దీనిపై జేసీ స్పందించి సర్వే త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం అరసాడలో జగనన్న లే అవుట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్లనిర్మాణం త్వరగా పూర్తిచేయాలని కోరారు. బిల్లుల బకాయి ఉంటే వెంటనే తెలియచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు, డీటీ రత్నకుమారి, రీ సర్వే డీటీ రమేష్‌నాయుడు, సర్వేయర్ చంద్రశేఖరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### సాగునీటి చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యం

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూర్చే అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం తామరఖండి గ్రామంలో సాగునీటి కాలువల్లో జరుగుతున్న ఉపాధి పనులను, మస్తరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్ల అభివృద్ధి, సాగునీరు నిల్వఉండే విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# సర్కారువారి భరోసా

పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన టి. నారాయణరావు చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. 6 ఏళ్ల క్రితం కిడ్నీ సమస్య రావడంతో నెలకు నాలుగుసార్లు విశాఖపట్నం వెళ్లి డయాలసిస్ చేయించుకునే వాడు. విశాఖపట్నం వెళ్తే వైద్యానికి, డయాలసిస్‌కు రూ.4వేల వరకు ఖర్చయ్యేది. దీంతో క్రమం తప్పకుండా డయాలసిస్‌కు వెళ్లలేకపోవడంతో కొన్ని రోజుల అనంతరం మృతిచెందాడు. ఇలా ఒక్క నారాయణ రావే కాదు. బయట ప్రపంచానికి తెలియకుండా చాలా మంది గతంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ప్రాణాలు కోల్పోయిన వారు ఎందరో ఉన్నారు.



పార్వతీపురంలోని డయాలసిస్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న కిడ్నీ డయాలసిస్ బాధితులు

- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అండగా ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైనబాధితులు
- గతంలో రూ.3వేలు మాత్రమే పింఛన్
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉచితంగా డయాలసిస్
- నెలకు రూ.10వేలు పింఛన్ అందజేత
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

పార్వతీపురం టౌన్:

ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో నిర్వహించిన ప్రజాసంకల్ప పాదయాత్రలో కిడ్నీ బాధితుల సమస్యలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే నేనున్నానంటూ బాధితులకు భరోసా కల్పించారు. రోజులు లెక్కించడం తప్పిస్తే తాము చేసేదేముందనే బాధితులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఉరట కలిగించింది. కిడ్నీ బాధితులకు ప్రతి నెలా రూ.10 వేల పెన్షన్ అందజేస్తూ ఆరిపోతున్న దీపాల్లో చమురు పోసిన ముఖ్యమంత్రి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. పాదయాత్రలో చాలాచోట్ల కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు వారి బాధలను జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించుకున్నారు. అధికారంలోకి వచ్చి నెల గడవక ముందే కిడ్నీ బాధితులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రూ.10 వేలు పెన్షన్ మంజూరుచేశారు. జిల్లాలో 130 మంది డయాలసిస్ బాధితులకు ప్రభుత్వం ప్రతినెలా రూ.13 లక్షలు పింఛన్ అందజేస్తోంది.

| నియోజకవర్గంలో బాధితుల పింఛన్ల వివరాలు | | |
|---|---|---|
| నియోజకవర్గం | లబ్ధిదారులు | చేకూరిన లబ్ధి (లక్షల్లో) |
| పార్వతీపురం | 44 | 4.40 |
| మొత్తం | 44 | 4.40 |

**పార్వతీపురంలో డయాలసిస్ సెంటర్లు**

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురం ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఆస్పత్రిలో కురుపాం, సీతానగరం, బలిజిపేట, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం బాధితులకు ఉచితంగా డయాలసిస్ చేస్తున్నారు. పార్వతీపురం కేంద్రంలో రోజుకు 33 మందికి డయాలసిస్ సేవలు అందుతున్నాయి.

### గతంలో పింఛన్ సరిపోయేది కాదు

గతంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన పింఛన్ రూ.3వేలు ఏ రకంగానూ సరిపోయేది కాదు. ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ రూ.10వేలు పార్వతీపురంలో డయాలసిస్ చేయించుకుంటున్న వారికి మందులకు, కుటుంబ అవసరాలకు సరిపోతాయి. ఏమి ఇచ్చినా ముఖ్యమంత్రి రుణం తీర్చుకోలేం.

– ఆర్.సత్యం, డయాలసిస్ బాధితుడు

### కిడ్నీ బాధితులపట్ల దేవుడు ముఖ్యమంత్రి జగన్

పార్వతీపురం ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ తరచూ చేయించుకుంటున్నాను. కిడ్నీ బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకోవాలంటే దాదాపు రూ.4వేలు ఖర్చయ్యేది. ఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా చేస్తున్నారు.

– కె.ఆదిలక్ష్మి, డయాలసిస్ బాధితురాలు

### సమస్య ఉంటే ఫ్యామిలీ డాక్టర్‌ను సంప్రదించండి



కిడ్నీకి సంబంధించిన సమస్య ఉంటే తక్షణమే గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్‌ను సంప్రదించడి. వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు ఇచ్చి అవసరమైన వారికి చికిత్స అందజేస్తారు. ప్రభుత్వాదేశాల మేరకు కిడ్నీ వ్యాధి గ్రస్తులకు రూ.10 వేల పింఛన్ అందజేస్తున్నాం. పార్వతీపురం కేంద్రంలో రోజుకు 33 మందికి ఉచితంగా డయాలసిస్ చేస్తున్నాం.

– డాక్టర్ బి.జగన్నాథరావు, డీఎంహెచ్ఓ, పార్వతీపురం మన్యం

### పింఛన్ సాయం ముఖ్యమంత్రి చలవే..

ముఖ్యమంత్రి మంజూరు చేసిన రూ.10వేలు పింఛన్ వలంటీర్ ఇంటికి వచ్చి ఇస్తున్నాడు. ఎప్పటికప్పుడు ఉచితంగా డయాలసిస్ చేయించుకుంటున్నాను. కుటుంబ అవసరాలకు కూడా పింఛన్ డబ్బు సరిపోతుంది. అదిఅంతా ముఖ్యమంత్రి చలవే.

– రౌతు కృష్ణ, కిడ్నీ వ్యాధిగ్రస్తుడు

# ప్రతిభను ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- నియోజకవర్గ స్థాయిలో 11 మంది విద్యార్థులకు పురస్కారాలు



విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్:

ప్రతిభను ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం నియోజకవర్గం స్థాయిలో గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివిన విద్యార్థులు 2023వ సంవత్సరంలో నిర్వహించిన పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం కింద ప్రతిభ అవార్డులతో సత్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమన్నారు. పార్వతీపురం నియోజకవర్గస్థాయిలో పదో తరగతిలో అత్యధిక మార్కులతో మొదటి స్థానం (582)లో నిలిచిన ఇద్దరు, రెండవ స్థానం(581)లో నిలిచిన ఒక విద్యార్థి, మూడం స్థానం (580)లో నిలిచిన నలుగురు, ఇంటర్మీడియట్‌లోని నాలుగు గ్రూపుల్లో ప్రతి గ్రూపులో అత్యధిక మార్కులు సాధించిన ఒక్కొక్కరు చొప్పున నలుగురు విద్యార్థులకు నగదు బహుమతితో పాటు మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్స్‌ను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులను శాలువాలతో, ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్స్, కళాశాల ప్రిన్సిపాల్స్‌ను శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోనుగౌరీశ్వరి, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి, పలువురు ప్రజాప్రతినిధులు, పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల ఎంఈఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అలాగే పార్వతీపురం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### మా కంటూ ఓ గుర్తింపు



పార్వతీపురం కేపీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివాను. నాకు 582 మార్కులు రావడానికి కారణం జగనన్న అందిస్తున్న పథకాలు, విద్య రంగంలో తీసుకున్న శ్రద్ధవల్ల మాత్రమే. మార్కులు సాధించిన మమ్మల్ని గుర్తించి సత్కరించడం చాలా ఆనందంగా ఉంది.

– ఎ. జోత్స్న, విద్యార్థిని, కేపీఎం పాఠశాల

### 'ప్రభుత్వ ప్రోత్సాహమే కారణం



నాకు 582 మార్కులు వచ్చాయంటే కేవలం ప్రభుత్వ కళాశాలలో అందిస్తున్న అత్యుత్తమమైన బోధన. కార్పొరేట్ పాఠశాలవలే మా పాఠశాలలో అన్ని వసతులు, సౌకర్యాలు అందించారు. అంతేకాకుండా పోషకాలతో కూడిన ఆహారాన్ని అందజేశారు.

– జాగాన గాయత్రి, విద్యార్థిని కేపీఎం పాఠశాల

### మంచి విద్య అందించారు



జోగింపేట ఎస్‌ఓఈ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూప్ చదివాను. నాకు 944 మార్కులు వచ్చాయి. ప్రభుత్వ కళాశాలలో అధునాతన సాంకేతికతతో కూడిన విద్యాబోధన అందించారు. ప్రభుత్వం విద్యారంగంలో అనేక మార్పులు తీసుకురావడమే ఇందుకు కారణం.

– ఎస్. అనిల్ కుమార్, ఎంపీసీ ఎస్‌ఓఈ ప్రభుత్వ కళాశాల, జోగింపేట

# విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అన్నారు. పట్టణంలోని కేహెచ్ మున్సిపల్ పాఠశాలలో గురువారం నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు ప్రతిభా పురస్కారాలు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పది, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించి, నగదు పురస్కారాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పిల్లలకు విద్యనే ఆస్తిగా ఇవ్వాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగనన్న పాఠశాలలను 'నాడు – నేడు' పథకంలో భాగంగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. జగనన్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. లక్ష్యంతో కూడిన విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, రెడ్డి సురేష్, దండి అనంతకుమారి, దండి శ్రీనివాసరావు, బవిరెడ్డి గౌతమి, కర్రి అప్పలస్వామి, సత్యప్రసాద్, బాలకృష్ణ, ఎంఈఓలు రాజకుమార్, జోగారావు, మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ ప్రభుత్వాన్ని దీవించండి



గేదెలపేటలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ఇంటింటికీ సంక్షేమ పథకాలను తలుపుతట్టి అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని దీవించాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు బలిజిపేట మండలం గలావల్లి సచివాలయం పరిధిలోని గేదెలపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా, దళారీతనం లేకుండా, అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నామన్నారు. దీనిలో ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే తెలియపరచాలని ప్రజలను కోరారు. ప్రతి ఇంటికీ తిరిగి వారికి ఏఏ పథకాలు వర్తించాయన్నది వివరించి వాస్తవమా కాదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి తలుపుతట్టి సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని దీవించి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేయాలని ప్రజలను కోరారు. గ్రామాల్లో ప్రజలు ఏ నాయకుడి చుట్టూ తిరగకుండానే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ ప్రభుత్వంలో అర్హత ఉంటే నేరుగా వలంటీర్ ద్వారా సంక్షేమ పథకం ఇంటికే చేరుతోందని, ఇటువంటి పారదర్శకమైన పాలనను అందిస్తున్న సీఎంను ఇంతవరకు చూశారా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అటువంటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, సర్పంచ్ చంద్రచూడామణి, ఎంపీపీ జి.నాగమణి, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మాధవనాయుడు, జి.కామినాయుడు, వాసుదేవరావు, డి.చిన అప్పలనాయుడు, ఆర్.గణపతి, డి.లక్ష్మీనారాయణ, బి.శ్రీరామూర్తి, సర్పంచ్ కె.మోహనరావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రీన్ అంబాసిడర్ల నిరసన

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్న గ్రీన్‌అంబాసిడర్లకు జీతాలను గ్రామపంచాయతీల ద్వారా చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు గవర వెంకట రమణ కోరారు. ఈ మేరకు గురువారం ఉదయం మండలకేంద్రంలో గ్రీన్‌అంబాసిడర్లకు జీతాలు చెల్లించ నందుకు నిరసనగా మార్కెట్‌లో విస్తరాకులతో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం గ్రామాల్లో వాహనాలతో వీధుల్లోకి వెళ్లి చెత్త సేకరించి ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. అయినా పంచాయతీలు జీతాలు చెల్లించకపోవడంతో గ్రీన్ అంబాసిడర్లు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అనంతరం గ్రీన్‌అంబాసిడర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట భిక్షాటన చేస్తూ నిరసన తెలియజేశారు. ఆందోళన కారులకు సీపీఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు సంఘీభావం తెలియజేసి తన అనుచరులతో కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఎన్వీ రమణకు గ్రీన్ అంబాసిడర్లు అందజేశారు.

### పార్వతీపురంలో వైఎస్సార్ కంటివెలుగు



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ గున్నేశ్వరరావు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని 14వ వార్డు సచివాలయం పరిధిలో డాక్టర్ నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు పర్యవేక్షించారు. పట్టణంలో 60ఏళ్లు దాటిన వృద్ధులకు కంటి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ నగేష్‌రెడ్డి తెలిపారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు, శుక్లాలు ఉన్నవారిని ఆపరేషన్ల నిమిత్తం విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలిస్తున్నామని చెప్పారు.

# కుటుంబానికి అండగా ప్రభుత్వం..



పొందూరు విజయ్, ఆటోడ్రైవర్, పార్వతీపురం

ఈ ఫొటోలో కనబడుతున్న వ్యక్తి పేరు పొందూరు విజయ్. పార్వతీపురం పట్టణంలో ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆటో నడుపుతూ రోజుకు రూ. 300 నుంచి 350 వరకు సంపాదిస్తాడు. గతంలో ఆటో బ్రేక్, ఫిట్‌నెస్ చేయించుకోవాలంటే సుమారు రూ.9వేల నుంచి రూ.10వేలవరకు ఖర్చయ్యేది. దీంతో పిల్లలను చదివించుకోవడం భారంగా ఉండేది. ఏం చేయాలో తోచక కష్టపడుతూ కుటుంబాన్ని నెట్టుకువచ్చేవాడు. జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత అమలు చేసిన వాహన మిత్ర పథకం కింద ఏటా రూ.10వేలు చొప్పున నాలుగు విడతల్లో రూ.40వేలు అందాయి. దీంతో ఏటా ఆటో బ్రేక్, ఫిట్‌నెస్ చేయించుకునే భారం తగ్గింది. అంతేకాకుండా హార్ట్ పేషెంట్ అయిన తనకు ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం రూ.3లక్షల 50వేలు అందజేసిందని చెబుతున్నాడు. 8వ తరగతి చదువుతున్న కుమార్తె హిమబిందుకు అమ్మఒడి పథకం ద్వారా రూ.15వేలు ఆర్థిక సాయం అందుతోంది. భార్య లలితకు రూ.6 లక్షల విలువగల ఇంటి స్థలం వచ్చింది. తండ్రి గుంపస్వామికి వృద్ధాప్య పింఛన్ రూ.2,750 ఫింఛన్, తల్లి భవానికి వైఎస్సార్ చేయూత రూ.18,500 అందుతున్నాయి. మొత్తం తన కుటుంబానికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి తామంతా జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపాడు.

– పార్వతీపురంటౌన్

# దిశ యాప్ మహిళలకు ఆయుధం

- డీఎస్పీ ఎస్.ఆర్.హెచ్ హరిత



భాస్కర్ కళాశాలలో దిశ యాప్ డౌన్‌లోడ్ డ్రైవ్‌లో పాల్గొన్న దిశ డీఎస్పీ ఎస్.ఆర్.హెచ్ హరిత

పార్వతీపురంటౌన్: దిశ యాప్ మహిళలకు ఆయుధం లాంటిదని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రం ప్రభుత్వం తెచ్చిన దిశ యాప్ మహిళల ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని దిశ డీఎస్పీ ఎస్.ఆర్.హెచ్ హరిత అన్నారు. ఈ మేరకు గురువారం దిశ యాప్ డౌన్‌లోడ్ ప్రత్యేక డ్రైవ్ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో పోలీస్ సిబ్బంది నిర్వహించిన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. టీబీఆర్ సినిమా థియేటర్‌లో మహిళలతో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ప్రయాణికుల్లో దిశయాప్‌పై అవగాహన కల్పించారు. బస్టాండ్‌కు వచ్చే ప్రతి బస్సులోకి వెళ్లి ప్రయాణికుల చేత దిశయాప్ డౌన్‌లోడ్ చేయించాలని ఎస్సై సంతోషిని ఆదేశించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**దిశ' యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలి**

సీతానగరం: ప్రభుత్వం మహిళల రక్షణ కోసం రూపొందించిన దిశ యాప్‌ను ప్రతి మొబైల్‌లో నిక్షిప్తం చేసుకుని అవసరాన్ని బట్టి వినియోగించడానికి అవగాహన కల్పించుకోవాలని ఎస్సై కె. నీలకంఠం అన్నారు.మండలంలో రెండు రోజుల్లో 600 మొబైల్స్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసినట్లు తెలిపారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో హెచ్‌సీ సుజాత మహిళాపోలీసు సిబ్బంది ప్రజలకు దిశ యాప్ డౌన్‌లోడ్ చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ వెంకటలక్ష్మి, సీహెచ్ఓ ఈశ్వరమ్మ, ఎస్ఏ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ



బజార్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

సాలూరు: మహిళల ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలచే తయారుచేయబడిన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ బజార్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలకు పెద్ద కొడుకులా.. సోదరుడిలా ముఖ్యమంత్రి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, మెప్మా సీఎంఎం పుష్ప, వైఎస్సార్‌సీపీ నాయకురాలు రాంబాయి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు వైఎస్సార్ బీమా నగదు

సీతానగరం: వైఎస్సార్ బీమా పథకంలో సభ్యుడిగా చేరి ఏవిధంగా మృతి చెందినా మృతుడి కుటుంబసభ్యులకు వర్తించే బీమా పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు అన్నారు. వైఎస్సార్ బీమా పథకంలో సభ్యత్వం తీసుకున్న అంటిపేట గ్రామానికి చెందిన ఎస్. కృష్ణ మృతి చెందగా బీమా వర్తించడంతో నామినీ (మృతుడి భార్య) రాధమ్మకు అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు నగదును పంచాయతీ కార్యదర్శి శశిభూషణరావు ఆధ్వర్యంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్. తిరుపతిరావు గురువారం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శశిభూషణరావు మాట్లాడుతూ కృష్ణ సహజ మరణం పొందినప్పటికీ వైఎస్ఆర్ బీమా పథకంలో సభ్యుడిగా ఉన్నందున రూ.1,00,000 బీమా వర్తించినట్లు చెప్పారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు ప్రస్తుతం ఇచ్చామని, మిగిలిన రూ.90 వేలు నామినీ బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సహాయకులు, గ్రామవలంటీర్లు పాల్గొన్నారు.